క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని మహతి పాలిక్లినిక్ ఆవరణలో నేడు (ఆదివారం) 11న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో స్త్రీ వైద్య నిపుణురాలు డా.శ్రీనిధి ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

ఆమనగల్లు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న సెలవుదినంగా ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా యూత్‌కాంగ్రెస్ కార్యదర్శి కృష్ణనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను ఓటు బ్యాంకుగా చూసిందని, గిరిజనుల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. గిరిజనుల విజ్ఞప్తి మేరకు సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించడం హర్షదాయకమన్నారు. అలాగే హైదరాబాద్‌లో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో తీరిన నీటి సమస్య


నీటిని తాగుతున్న ప్రయాణికులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నీటి సమస్య తీరింది. గత ఏడాది దాతల సహకారంతో ప్రయాణికులకు మంచినీరు అందించడానికి కూలర్ ఏర్పాటు చేశారు. కాగా, రెండు నెలల క్రితం మంచినీటి కూలర్ పైప్‌లను దుండగులు పగులకొట్టడంతో కూలర్ పని చేయలేదు. దీనితో బస్టాండ్‌లో ప్రయాణికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కూలర్‌కు శనివారం స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ ఎస్.జగదీశ్వర్ మరమ్మతులు చేయించారు. కూలర్ పనిచేయడంతో ప్రయాణికుల నీటి ఇబ్బందులు తీరాయి.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ


టై, బెల్టులు పంపిణీలో ఉపాధ్యాయులు

మంచాల: మండలంలోని దాద్‌పల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం టై, బెల్టులు పంపిణీ చేశారు. విద్యార్థులకు టై, బెల్టులు అందజేసిన దాత శ్రీనివాస్‌ను శాలువా కప్పి ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు రాము, కిరణ్, లలిత పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పరమేశ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం పొందడానికి నేడు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకానున్న చిన్నారులకు సొంత ఖర్చులతో పరీక్షా సామగ్రి , ప్యాడు, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ఇంగ్లీష్ మీడియం విజయవంతంగా నడుస్తుందని చెప్పారు.

రుణమాఫీ అమలు చేయండి

యాచారం: రైతురుణ మాఫీ చేసి, రైతుబంధు నిధులు జమ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. ప్రస్తుతం పంటల సాగు జరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడుల కోసం రైతుబంధు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలకు చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇండ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆర్థిక సాయం అందజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌కు చెందిన కమటం యాదయ్య, తోట తిరుపతయ్యల నూతన ఇంటి నిర్మాణానికి శనివారం ట్రస్టు సభ్యులచే సిమెంట్, స్టీల్, కాంక్రీట్, ఇటుక, తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమావతి, రమేశ్, రాజు, ఎండీ అసత్, కిషన్, ఎండీ అశ్రఫ్, పాండురంగయ్య, విష్ణు, అశోక్, తదితరులున్నారు.

నేడు బాలయేసు వార్షికోత్సవం

- వేలల్లో హాజరుకానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


బాలయేసు పుణ్యక్షేత్రం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ప్రతి ఏటా ఫిబ్రవరి నెల 2వ వారంలో బాలయేసు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. శనివారం మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటగా కమ్మగూడలో బాలయేసు పుణ్యక్షేత్రాన్ని నిర్మించారు. దేశంలో ఇది మూడవది. బయట నుంచి చూస్తే ఈ పుణ్యక్షేత్రం మత్స్య ఆకారంలో కనిపిస్తుంది.

విస్తరణ, పునర్నిర్మాణం....

ఈ క్షేత్రానికి నగరం నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తుల తాకిడి పెరగడంతో 1992లో ఆలయ విస్తరణను చేపట్టారు. 100 అడుగుల ఎత్తులో ధవళవర్ణంతో రెండు గాలిగోపురాలను ఏర్పాటు చేశారు. 150 కిలోల కంచు గంట అమర్చారు. రెండు గాలిగోపురాల మధ్య సింహద్వారం ఉంటుంది. భారతీయ కళా సంపద ఉట్టిపడేలా 70 అడుగుల ఎత్తులో ఒక గుహగోపురం తీర్చిదిద్దారు. నీవు నన్ను ఆరాధిస్తే నేను నిన్ను ఆదరిస్తా అన్న బాలయేసు మాటలను గోడలపై లఖించారు. దేవమాత గుహతో పాటు దర్శించుకునే ప్రదేశాలు ఇక్కడ చాలా ఉన్నాయి. ప్రతి ఏటా మహోత్సవాలకు 50వేలకు పైగా భక్తులు హాజరవుతుంటారు.

రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్యాక్రమాలు

శనివారం ఫా. డేవిడ్ కొప్పర , సహాయ గురువు, యంజాల తెలుగులో దివ్య బలిపూజ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఫా. పి. జీవన్ బాబు , గంటారాధన, వ్యాఖ్య పరిచర్య, దివ్య బలిపూజ చేశారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలయేసు మహోత్సవాలకు ఆర్టీసీ నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఇన్‌ఫాంట్ జీసస్ స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సులను ఆదివారం నడపనుంది. ఎంజీబీఎస్ డిపో, మెహిదీపట్నం, నాంపల్లి, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బస్సులను నడపనున్నారు. ఇప్పటికే


ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

చర్చి కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్ల పూర్తి చేశారు. వనస్థలిపురం పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. క్యాతలిక్ హబ్, దివ్యవాణి టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

హయత్‌నగర్: ప్రభుత్వ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదుతో అబ్దుల్లాపూర్‌మెట్టు తహసీల్దార్ రవీందర్ దత్తు శనివారం ఆ భూమిని పరిశీలించారు. హత్తిగూడలోని సర్వేనంబర్ 12లోని సుమారు 2.33 ఎకరాల భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్, సీపీఐ నాయకులు యాదిరెడ్డి గత గురువారం అబ్దుల్లాపూర్‌మెట్టు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆ భూమిని పరిశీలించారు. భూమిని సర్వే చేయించి హద్దులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా కబ్జాకు ప్రయతిన్స్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

విలువైన భూమిని రక్షించి క్రీడా ప్రాంగణం కోసం కేటాయించాలని కౌన్సిలర్ లక్ష్మణ్ తహసీల్దార్‌ను కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు

కడ్తాల్: మండలంలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రియాంక శంకర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మహేశ్వర మహాపిరమిడ్ చైర్మన్ విజయభాస్కర్


పూజలు చేస్తున్న భక్తులు, నాయకులు

రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్, చేగూరి వెంకటేశ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీఐ శివప్రసాద్

కడ్తాల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కల్గిండాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రావిచేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9,10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ, సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడొద్దని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తతో ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరాలు,


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ

నైతిక విలువలు, విద్యార్థులు క్రమశిక్షణ, కుటుంబ బాధ్యత, సైబర్ క్రైమ్స్, చట్టాలు, ఉన్నత లక్ష్యాల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వితలయ్యగౌడ్, భారతమ్మ, విద్యాకమిటీ చైర్మన్ రవీందర్, హెచ్ఎం సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనలో జనరంజక బడ్జెట్

- ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యం
- పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ముందు పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థికశాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రూ.53,196 కోట్లు కేటాయించడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వ హామీలను వంద రోజులలోపు అమలు చేసి తీరుతామని చెప్పారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రైతు డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్, మైనార్టీ డిక్లరేషన్‌లను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. గత ప్రభుత్వంలో రైతుబంధు పథకం నిధులు అనర్హులకు అందాయని, కాంగ్రెస్


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ప్రభుత్వం నిజమైన అర్హులకు రైతుభరోసా కింద రూ.15 వేలు అందిస్తోందని, కౌలురైతులకు కూడా అందించడం జరుగుతుందని చెప్పారు. రెండు లక్షల రుణమాఫీపై త్వరలో కార్యాచరణ ప్రారంభమవుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. సమావేశంలో సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిగూడలో 'గావ్ చలో అభియాన్'

మంచాల: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి పొండాల జంగయ్య గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపల్లి గూడ గ్రామంలో 'గావ్ చలో అభియాన్ ' కార్యక్రమం నిర్వహించారు. ఈ జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండా గ్రామాల్లో ఏ సంక్షేమ పథకం అమలు కావడం లేదన్నారు. గ్రామాల్లోని స్మశాన వాటికలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటడం, ఉపాధిహామీ పథకం కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్నాయని చెప్పారు. రైతు సాధికారత పేరుతో సాంకేతికతను తీసుకొని రావడం జరిగిందన్నారు. ధాన్యానికి మద్దతు ధర పెంపు, పంటల బీమా, ఒకే దేశం- ఒకే ఎరువు వంటి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నూకం రాజు, నాయకులు ఐలయ్య, బండ జయమ్మ, సంతోష్ కుమార్, యాదయ్య, మహేష్, వంశీరెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, మిషన్ భగీరథ నీళ్లు కూడా సరిపడా సరఫరా అయ్యే అవకాశం ఉండకపోవచ్చని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. శనివారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లోని బోరుబావులను వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపైనే ఆధారపడి ఉండొద్దన్నారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

వెంకటేశ్వర్లు గౌడ్‌కు సన్మానం


వెంకటేశ్వర్లు గౌడ్‌ను సత్కరిస్తున్న నేతలు

మాడ్గుల: జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన యాచారం వెంకటేశ్వర్లు గౌడ్‌ను శనివారం పలువురు ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని సుద్దపల్లిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మహేష్ గౌడ్, సురేష్‌గౌడ్, రవి, సతీష్ , గోవిందు పాల్గొన్నారు.

స్వామివారి పెళ్లికి రండి

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభమై 19 వరకు కొనసాగనున్నాయి. ఆలయ క్రియాశీలక కార్యవర్గ సభ్యులు, పూజారి మొక్కురాల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. 16న జరగనున్న చెన్నకేశవస్వామికి కల్యాణానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, అర్చకులు వెంకటేశ్వరశర్మ, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసుగౌడ్, నర్సింహ, రంగారెడ్డి పాల్గొన్నారు.

నూతన సీఐకి కాంగ్రెస్ నేతల సన్మానం


సీఐకు మొక్క అందజేసి సత్కరిస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ నూతన సీఐగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన సైదయ్యను శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు మజ్జిగ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సీఐని సత్కరించి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు తమవంతుగా సహకరిస్తామని లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పెద్దఅంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు జ్ఞానీగౌడ్, నాయకులు సంజీవ, సుధాకర్ రెడ్డి, భరత్‌కుమార్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఇబ్రహీంపట్నం రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు పురోగతి సాధించాలని సీవీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్‌సీ శివారెడ్డి, సీనియర్ ప్లేస్‌మెంట్ అధికారి విజయమైర్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి సమీపంలో గల సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గూగుల్ డెవలపర్స్ క్లబ్, సీవీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో బిట్ అండ్ బిల్డ్ రాష్ట్రస్థాయి ఒకరోజు హాకథాన్‌ను కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి యొక్క సాంకేతిక నైపుణ్యాలను వినియోగించి, ఆలోచనలను కార్యరూపం దాల్చారు. ఇందులో ఉత్తమ ప్రతిభ


ప్రథమ బహుమతి స్వీకరిస్తున్న విద్యార్థులు

కనబర్చిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10 వేలు , ద్వితీయ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో గూగుల్ కాలేజీ కోఆర్డినేటర్లు విజయమైర్, సీతరాం, నాగేష్‌లు ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

మాడ్గుల: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని ప్రజాపాలన దరఖాస్తులను గత మూడు రోజులుగా అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 16,682 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఇందులో రూ.500 సబ్సిడీ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 5,796 మంది తప్పుగా దరఖాస్తు చేసుకున్నారు. తప్పు ఫారాలను పరిశీలించి సరైన వివరాలను గత మూడు రోజులుగా గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు, ఆశలు నమోదు చేస్తున్నారు. మండల పరిధిలోని దొడ్లపహడ్, అప్పారెడ్డిపల్లి, కొలుకులపల్లి,నర్సాయిపల్లి గ్రామాలను శనివారం ఎంపీడీఓ రాఘవులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిషన్ రెడ్డి, గ్రామ కార్యదర్శ పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

13న చలో నల్లగొండ సభకు తరలిరండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఢిల్లీ పాలకులకు కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిగా మార్చేందుకు కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందన్నారు. గత పది సంవత్సరాలుగా ఎన్ని ఒత్తిడిలకు గురి చేసిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే ప్రజలకు తీరని ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, ఆపార్టీ మండల, మున్సిపల్ నాయకులు చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, కిషన్‌గౌడ్, కొప్పు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలందరికీ పథకాలు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలకు గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల విద్యుత్ బిల్లులకు రేషన్ కార్డు లింక్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ సర్వీస్, తప్పులను సరిదిద్దడం కోసం, శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆశవర్కర్ల, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500 కే సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, ఏఈ నరేందర్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, శ్రీను, అజ్గర్‌అలీ, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, కార్యదర్శి రాఘవేందర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తుర్కయంజాల్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను ఆరుబయట వేయకూడదని, ప్రతి కాలనీకి స్వచ్ఛ ఆటోలను పంపిస్తున్నాం. ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

యాచారం తహసీల్దార్ బదిలీ

యాచారం: మండల తహసీల్దార్ బి. శ్రీకాంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు మించి జిల్లాలో విధులు నిర్వర్తించిన తహసీల్దార్లను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో యాచారం తహసీల్దార్ బి. శ్రీకాంత్‌రెడ్డిని యాదాద్రి జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.